# "మేము క్రీస్తును ప్రకటిస్తున్నాం"

2 కొరింథీ. 4:5, 6లో ఈ ప్రతిపాదన చేసినప్పుడు, అపొస్తలుల సువార్త ప్రకటనలోని చర్చనీయాంశాన్ని పౌలు మనకు బయలుపరచాడు: "గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుటలేదు గాని, క్రీస్తుయేసునుగూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము."

క్రొత్త నిబంధనయొక్క అనేక లేఖన భాగాలలో ఈ వాస్తవం స్పష్టంగా కన్పిస్తుంది. పెంతెకొస్తు దినాన పేతురు ప్రసంగం యొక్క చర్చనీయాంశం క్రీస్తే (అపొ. 2:36 చూడు). అపొ. 8లోని మార్పులు పొందిన రెండు సంఘటనలలోను ఫిలిప్పు యొక్క చర్చనీయాంశము–క్రీస్తు (5, 35 వచనాలు చూడు). అపొస్తలుల యొక్క సువార్త ప్రకటన అవకాశము లేక విధానములో లోకవ్యాప్తమైనది, దాని ఫలితాలలో విప్లవాత్మకమైనది. వారు భూమిని తల్లక్రిందులు చేసినట్టు అపొస్తలుల యొక్క శత్రువులు సహితము అన్నారు. తాను జీవించిన కాలంలో పౌలు రెండు ఖండాలను, తన మరణానంతరం యింకా చాలా వాటిని కదిలించాడు.

కొద్దిమంది మనుష్యులు రోమా ప్రపంచాన్ని జయించారు. దాన్ని వారెలా చేశారు? వారు తమ సొంత మాటలలోనే బదులిచ్చారు: "మేము క్రీస్తును ప్రకటిస్తున్నాం." "మేము క్రీస్తును గూర్చి ప్రకటిస్తున్నాం" అని వారు చెప్పలేదు. క్రీస్తును ప్రకటించినప్పుడు అపొస్తలులు దేన్ని ప్రకటించారు?

## ఆయన దేవత్వాన్ని

దేవుడననీ యేసు చెప్పుకున్నాడు (యోహాను 19:7; మార్కు 14:61, 62; యోహాను 10:32–38; 14:8–11లను చూడు). తండ్రియైన దేవుడు ఆయనను "నా ప్రియ కుమారుడని" పిలిచి, యేసుకు దేవత్వాన్ని ఆరోపించాడు (మత్తయి 3:17; 17:5). మనుష్యులందరు దేవుని కుమారులేయని ఆధునిక వాదులు చెప్పవచ్చుగాని, యేసు దేవుని కుమారుడనే భావంలో ఏ నరుడును ఆయన కుమారుడు కాదు. ఆయన దేవుని "అద్వితీయ" కుమారుడై యున్నాడు (యోహాను 3:16). హెబ్రీ. 1:8–10లో దేవుడు తన కుమారుని సంబోధించి, ఆయనను "దేవా" అని పిలిచాడు.

ఆయన భూ నివాస కాలంలో దేవుని గూర్చి తెలియబడిన ప్రతి (గుణగణం) లక్షణం

యేసునందు ప్రత్యక్షపరచబడింది. ఆయన న్యాయాన్ని, పరిశుద్ధతను, కనికరమును, ప్రేమను-క్షమించే శక్తిని సహా ప్రదర్శించాడు. తన దేవత్వపు వాస్తవాన్ని స్థాపించడానికి ఆయన అద్భుతాలను చేశాడు (యోహాను 20:30, 31). మొదటి శతాబ్దపు సువార్త ప్రకటనలో క్రీస్తు దైవత్వం ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకొని ఉంటుందని తెలియ వస్తుంది, అది అలాగే జరిగింది. ఉదాహరణకు, క్రీస్తు జరిగించిన అద్భుతములు అపొ. 2లోని తొలి సువార్త ప్రసంగంలో ఎత్తి చూపబడ్డాయి.

క్రీస్తు దైవత్వాన్ని ప్రకటించడమంటే, ఆయన మానవత్వాన్ని కాదనడం కాదు. ఆయన దేవుడు, మానవుడు-రెండునైయున్నాడు. ఆయన "మనుష్యకుమారుడు" మరియు "దేవుని కుమారుడు"ను కూడా అయ్యున్నాడు. ఆయన "సశరీరుడుగా ప్రత్యక్షుడైన" దేవుడు (1 తిమోతి 3:16). ఆయన "మనుష్య పోలికగా" చేయబడినవాడు లేక పుట్టినవాడు (ఫిలిప్పీ. 2:7).

### ఆయన మునుపటి ఉనికి

యేసు యొక్క దైవత్వాన్ని స్థాపించిన మీదట, సూచన చేయబడినట్టుగా స్థాపింపబడిన యితర సిద్ధాంతాలను చూద్దాం. తొలిగా, ఆయన ముందటి ఉనికిని మనం ఆలోచన చేయాలి. "అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నా"నని అంటూ యేసు ఈ భావనను బోధించాడు (యోహాను 8:58). యోహాను 17:5లో ఆయన ప్రార్థించుచుండగా, యిలా అన్నాడు, "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ ఉండెనో ఆ మహిమతో నీయొద్ద నన్ను యిప్పుడు మహిమపరచుము." యేసే ఈ సత్యాన్ని నొక్కి చెప్పినందున, తన అనుచరుల రచనలలో ఈ సంగతి కన్పించడంలో ఆశ్చర్యముండదు. యోహాను 1:1-4; 1 యోహాను 1:1, 2; కొలస్సీ. 1:15-18; ప్రకటన 1:8లను చదువు.

### ఆయన నరావతారం

భూలోకమునకు రాక మునుపు యేసు ఉండియున్నట్టయితే, ఆయన రాక ఆయన ఆరంభమై ఉండదు, కాని ఆయన నరావతారమై ఉంటుంది. ఆయన అవతారాన్ని (శరీరమును దాల్చుటను) గూర్చి యోహాను 1:14 మరియు ఫిలిప్పీ. 2:5-8ల్లో మనం చదువుతాం.

కన్య గర్భమున జన్మించునని యెషయా ప్రవచనాన్ని యేసు నెరవేర్చినట్లు మత్తయి తెలిపాడు (మత్తయి 1:22, 23). యేసుని జన్మ విధము పూర్వ సంభవంలేనిది, సాటిలేనిది. అది మన ఊహకు అతీతమైనది. ప్రకృతి సిద్ధమైన వివరణకు సరిపోని దేనినైన వదలి వేయాలని అనేకమంది బైబిలు పండితులు కోరుతారు. అయినా, యేసును ప్రకటించడ మంటే మాత్రం ఆయన నరావతారాన్ని ప్రకటించడం; ఆయన నరావతార విధానం కన్యకు జన్మించడమే. కన్య గర్భమందు ఆయన జన్మను కాదనిన ఎవడును క్రొత్త నిబంధన క్రీస్తును ప్రటించనేరడు.

## ఆయనను సిలువ వేయడం

తాను చనిపోతానని క్రీస్తు చెప్పాడు (యోహాను 10:15). "క్రీస్తు సిలువవేయబడినట్టు" పౌలు ప్రకటించాడు (1 కొరింథీ. 1:23), మరియు "క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను" అని సూటిగా చెప్పాడు (1 కొరింథీ. 15:3). "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు" అని మనం చెప్పబడ్డాం (హెబ్రీ. 9:22). రక్తమును గాని, పాప పరిహార బలి గూర్చి తమ ప్రసంగాల్లోనుండి అనేకులు ఎత్తి వేశారు. మన పాపముల కొరకు ఆయన మరణాన్ని అలక్ష్యం చేసినట్లయితే, క్రీస్తు ప్రకటించబడడు.

## ఆయన పునరుత్థానం

దేనికంటెను మించి, ఆయన పునరుత్థాన సత్యము, ఆది సంఘపు విజయాన్ని వివరిస్తుంది. తాను లేస్తానని క్రీస్తు చెప్పాడు (యోహాను 2:19-21), తరువాత ఆయన లేచినట్టు చెప్పాడు (ప్రకటన 1:18).

తొలి సువార్త ప్రసంగంతో ఆరంభించి (అపొ. 2), అపొస్తలుల సువార్త ప్రకటనలో పునరుత్థానము ప్రధానమైన స్థానాన్ని ఆక్రమించింది. ఈ సందేశం మీదనే సంఘం స్థాపించబడింది. ఇది నిజమా, లేక సంఘం అసత్యం మీద కట్టబడిందా?

పునరుత్థానమే అపొస్తలులకు నూతన బలమునిచ్చింది. తిరిగి జనించిన వారి నిరీక్షణ, అసాధారణమైన వారి విజయం అనే వాటిని వివరించడానికి వేరే మార్గం లేదు. వారు చూచింది నిజం. క్రీస్తును ప్రకటించడమంటే, క్రీస్తు మృతులలోనుండి లేపబడినట్టు ప్రకటించడం.

## ఆయన రాజ్యం

క్రీస్తును గూర్చి ప్రసంగించుటలో, ఆయన రాజ్యం లేక సంఘం చేర్చబడాలి (అపొ. 8:5, 12). క్రీస్తు శిరస్సు, సంఘము ఆయన శరీరమైయుంది (ఎఫెసీ. 1:22, 23). సమాధానపరచబడడం ఆ శరీరంలో జరిగే పనియే (ఎఫెసీ. 2:16). క్రీస్తును ప్రకటించుతూ, సంఘాన్ని విడిచి పెట్టలేం. క్రీస్తును ప్రకటించడంలో, ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించాడు.

## ఆయన ఆజ్ఞాపించినవి

క్రీస్తును ప్రకటించ గోరినవాడు ఆయన ఆజ్ఞలు ప్రకటించి తీరాలి. ఆయన ఉపదేశాలు అలక్ష్యం చేయబడినప్పుడు, క్రీస్తు ప్రకటింపబడనేరడు. ఐతియొపీయుడైన నోబుల్‌మన్‌కు ఫిలిప్పు క్రీస్తును గూర్చి ప్రకటించినప్పుడు, అతనికి బాప్తిస్మం పొందవలెనను అవసరతను గ్రహింపజేశాడు (అపొ. 8:35, 36). లేదు, మనం బాప్తిస్మాన్ని విడిచిపెట్టి క్రీస్తును ప్రకటించలేం. ఆయన ఆజ్ఞలలో అది ఒకటి.

## ఆయన రెండవ రాకడ

మరల వస్తానని యేసు బోధించాడు (యోహాను 14:1-3). తెల్లని వస్త్రములు ధరించిన మనుష్యులు (దేవదూతలు) యేసు మరల వస్తాడని అపొస్తులులకు అభయ మిచ్చారు (అపొ. 1:11). హెబ్రీ రచయిత అదే వాస్తవాన్ని ప్రకటించాడు (హెబ్రీ. 9:28). దాన్ని తక్కిన దైవ ప్రేరేపితులైన లేఖకులు తిరిగి చెప్పారు: క్రీస్తును ప్రకటించడమంటే ఆయన రెండవ రాకడను ప్రకటించడమైయుంటుంది.

## ముగింపు

నేడు అనేకులచే యేసును గూర్చినట్టియు ఆయన సువార్తను గూర్చినట్టియు సత్యాలు తిరస్కరించబడుతున్నాయి. యేసును గూర్చి మర్యాదగల, ఫలితార్థములులేని సంగతులను చెప్పాలని జనులు కోరుతున్నారు; ఆయన నైతిక సూత్రాలు సమాజ సంబంధమైన దోషాలను బాగు చేస్తాయని వారు కేవలం గుర్తింపగోరుతున్నారు. అదే సమయంలో, క్రీస్తును గూర్చి ప్రకటించడంలో ప్రకటింపవలసిన వాస్తవాలను వారు కాదంటున్నారు లేక విడిచి పెడుతున్నారు. ఇంకను క్రీస్తు కొందరికి వెర్రితనముగాను మరి కొందరికి ఆటంకముగాను ఉన్నాడు (1 కొరింథీ. 1:18; 1 పేతురు 2:7, 8).

"క్రీస్తును గూర్చి నీకు ఏమి తోచుచున్నది?" (మత్తయి 22:42).